# మా మామయ్య

వా. స. మూర్తి

మా మామయ్య పదహారణాల ఆంధ్రుడు—అవునా కాదా అనేది వివాదాస్పద విషయమే ననుకోండి. అయినా మా మామయ్య తాను పదహారణాల ఆంధ్రుణ్ణి అనే చెప్పుకుంటాడు. మా మామయ్య ఆంధ్రత్వం ఆవేళ గట్టిగా గాడ్పులు వీచినా, సమయానికి వర్షం కురవకపోయినా దీనికి అరవలే ఏదో చేసి ఉంటారనేటంత ధోరణిలో చీటికీ మాటికీ అరవలను తిట్టడంలోనూ, ఎంతటి వాయకుడైనా ఉత్తి వధవ అనడంలోనూ ముఖ్యంగా వ్యక్తమవుతూ ఉంటుంది. అరవల సొంత తిట్టినా అరవల ఇడ్లీ, సాంబారు లేనిదే మామయ్యకు రోజు గడవదు. ఇదేమిటని ఎవరేనా అడిగితే ఇడ్లీ అసలు మన మినపకుడుములే నని, అరవదేశానికి పోయి ఈ రూపంలో తిరిగివచ్చాయనీ, అలాగే సాంబారు కూడా మన పప్పుపులుసే ననీ కాబట్టి తాను తినేవి మినపకుడుములూ, పప్పుపులుసే నని చెప్పి తన ఆంధ్రత్వం మీద మచ్చపడకుండా చూసుకుంటాడు. తన పదహారణాల ఆంధ్రత్వానికి ఇంకొక ప్రబల నిదర్శనంగా ఆంధ్రరాష్ట్రంకోసం జరిగిన ఉద్యమంలో తాను పాల్గొనడం చూపిస్తాడు మామయ్య. పొట్టి శ్రీరాములు గారి పూర్ణాహుతి సందర్భంలో జరిగిన కల్లోలంలో తనూ ఉన్నాడు. ఆ వేళ తుపాకీ గుండ్లకైనా సిద్ధపడి ముందుకువచ్చా నంటాడు మామయ్య—ఆవేళ తుపాకీ కాల్పులవరకూ వ్యవహారం వస్తుందంటే అసలు వీధిలోకి అడుగుపెట్టేవాడా అనేది అనుమానమే కాని—ఆనాడు కల్లోలం లేవదీసిన గుంపులలోమాత్రం ఉన్నాడు. అందువల్ల తాను తుపాకీగుండ్లకు గుండె చూపి నిలబడ్డానంటే మనం ఒప్పుకోవలసేవస్తుంది. ఈ సందర్భంలో అరోజే ఇంకొక చిన్న విషయం జరిగింది. దాని సంగతి మా మామయ్యకూ, నాకూ, ఈ ఊరి అరవ హోటలు ప్రొప్రయిటరికీ, ఒక సెర్వర్‌కీ తప్ప మరొకరికి కూడా తెలియదు.

ఆవేళ మామయ్య గుంపులతోబాటు తిరుగుతూ 'ఆంధ్రరాష్ట్రం కావాలి', 'పొట్టి శ్రీరాములుకు జోహార్', 'ఆంధ్రమాతాకీ జై' అంటూ అరుస్తూ ముందుకుపోసాగాడు. జనం కార్లూ బస్సూ ఆపివేస్తున్నారు. దుకాణాలు మూయించివేస్తున్నారు. ఈ హడావుడిలో నా మామయ్య దృష్టి ప్రక్కనున్న అరవహోటలుమీద పడింది. ఆ హోటలు ప్రొప్రయిటరు అప్పటికే హడలిపోయి, తలుపులు వేసుకొని, ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ఒకమూల నక్కి చూస్తున్నాడు. మామయ్యకు అరవహోటలు చూసేసరికి వీరావేశం పెత్తుకువచ్చింది. 'ఈ హోటలుమీద పడదాం రండ్రా' అని అరిచాడు. కాని జనం కార్ల నాపుజేయడంలోనూ, కేకలు వేయడంలోనూ మునిగిపోయి మామయ్య మాట వినిపించుకోలేదు. ఇంతలో వెనకనుంచి ఎవరో లాల్చీ పట్టుకొని లాగారు. మామయ్య అదిరిపడి వెనక్కి తిరిగాడు. అరవహోటలు ప్రొప్రయిటరే. 'తమతో ఒక చిన్నపని ఉందండి, ఇలా రాండి సార్' అని పిలుచుకు వెళ్ళి దొడ్డివైపునుంచి లోపలకు తీసుకుపోయి, మామయ్యను కూర్చోబెట్టి డజను ఇడ్లీ, గిన్నెడు సాంబారూ ఎదరపెట్టి, "నామీద దయ ఉంచండి సార్, బ్రతికి ఉన్నంతకాలం మీపేరు చెప్పుకొని బ్రతుకుతాను సార్. నా హోటలుమీదికి జనాన్ని రానీయకండి సార్, మీరు చాలా మంచివారని నాకు తెలుసు సార్," అంటూ బ్రతిమాలడం మొదలుపెట్టాడు. ఎదర ఇడ్లీ కనిపించినప్పుడు వాటిని అలాగే వదిలివేయడంకన్న మరొక అపచారం ఉండదని మామయ్య సిద్ధాంతం కాబట్టి, ఆడజను ఇడ్లీలు సాంబారుతో ఆరగించి, గుర్రున త్రేన్చి, "సరే నీకేం పరవాలేదులే. నేను చూస్తాను" అంటూ తన ఔదార్య బుద్ధినంతా ప్రదర్శించాడు.

అదిమొదలుకొని మామయ్య కాఫీహోటలులో ఫ్రీయే. హుషారుగా ఉంది మామయ్య పని. కాని కొంతకాలం గడిచాక ప్రొప్రైటరు ఎదురుతిరిగాడు. మామయ్య మామూలుగానే ఇడ్లీ సాంబారు సేవించి వచ్చివేస్తున్నాడు. ప్రొప్రయిటరు 'డబ్బులుసార్' అన్నాడు. మామయ్య ఉలిక్కిపడ్డాడు. తన చెవులను తానే నమ్మలేకపోయాడు. 'ఏమిటే' అన్నాడు ఆశ్చర్యపోతూ. 'డబ్బుల్ సార్' అని మళ్ళీ చెప్పాడు ప్రొప్రయిటరు. 'ఏమిటే' అన్నాడు మళ్ళీ మామయ్య ఇంకా అర్థం చేసుకోలేక, "సరిగా వినబడ్డంలేదాసార్, తిన్నదానికి బిల్లు చెల్లించి పొమ్మంటున్నాను సార్" అన్నాడు ప్రొప్రయిటరు గట్టిగొంతుకతో. మామయ్య కళ్ళు పైకి వచ్చాయి. అసాటి ప్రొప్రయిటరేనా ఈనాడిలా మాట్లాడుతున్నది! "ఏమిటి, ఎవరి నడుగుతున్నావో తెలుసా?" అన్నాడు మామయ్య నిజమైన చిరాకుతో. "ఆ తెలుసుసార్. ఇక ఊరికే పెట్టేదిలేదు సార్" అన్నాడు ప్రొప్రయిటరు. "నిన్నెంత అపాయంనుంచి తప్పించానో అప్పుడే మరచిపోయావ్రా? - నాకు కోపంవస్తే - " "కోపంవస్తే ఏమీ పరవాలేదుసార్. నేనే అనవసరంగా భయపడ్డానాదినం. మా అరవలని మీ ఆంధ్రులు ఏం చేస్తారో అని భయపడ్డాను. కాని ఎక్కడా మీ ఆంధ్రులు మా జోలికే రాలేదుసార్. ఇప్పటివరకూ మీకు పెట్టినదానికి చాలా నష్టం వచ్చింది. ఇక పెట్టేదిలేదు. అట్టే మాట్లాడితే నలుగురితోనూ చెప్పి ఇన్నాళ్ళూ తిన్నదానికికూడా డబ్బు వసూలు చేస్తాను సార్" అన్నాడా ప్రొప్రయిటరు ఖండించినట్టుగా. మామయ్యగొంతుకలో పచ్చివెలగకాయపడింది. 'తస్సాదియ్యా, జిత్తులమారితనంలో అరవలకు అరవలే సాటి' అని లోపల తిట్టుకొని డబ్బు చెల్లించి బయటపడ్డాడు. అప్పటినుంచీ మళ్ళీ మామయ్య మునుపు చెల్లించవలసే వస్తోంది. మరి అటు ఇడ్లీ సాంబారును వదలలేడాయె. తనకు

గర్భనిరోధిని:— యిటుమీదట గర్భంరాకుండా అవుటకు రూ. 10/-
సిద్ధమకరధ్వజం మాత్రలు: మంచి వీర్యవృద్ధి బలంకల్గించి, శీఘ్రస్ఖలనం అవుటకు రూ. 10/-
నపుంసక తైలం:— అంగనరములు బలహీనత పోవుటకు రూ. 10/- పోష్టు ఖర్చులు 1-4-0 అగును. అడ్వాన్సు పంపేది.
డా॥ రత్నం నర్స్ మెడికల్ హాల్, మలకపేటబిల్డింగ్స్, హైదరాబాదు.(దక్కన్)

అరటలమీదఉన్న కక్షనంతా రోజూ ఆరిడ్లీ, సాంబారూ జఠరాగ్నిలో పడవేయడం ద్వారా తీర్చుకుంటున్నాడు.

రాజకీయాలంటే పడిచావడంలో ఆంధ్రులను మించినవారు లేరనేందుకు ఉదాహరణగా మామయ్య కనిపిస్తాడు. మామయ్య పత్రికా పఠనం నియమపూర్వకంగా 'టైటిల్' దగ్గరనుంచీ, 'ఎడిటెడ్, ప్రింటెడ్ అండ్ పబ్లిష్డ్ బై –' వరకూ చదువుతాడు. ఆంధ్రరాజకీయాలన్నీ మామయ్యకు కరతలామలకమే. ఎప్పుడు ఏ నాయకుడు ఏ మరొక నాయకుణ్ణి ఏవిధంగా తిట్టిందీ, ఆ మరొక నాయకుడు ఎటువంటి తిట్లతో జవాబు చెప్పిందీ; ఎప్పుడు ఏ నాయకుడు ఒక గట్టి ప్రకటనను చేసిందీ, మళ్ళీ అదే నాయకుడు అదే ప్రకటనను అంతే గట్టిగా ఖండించుకున్నదీ; ఎప్పుడు ఏ నాయకులు భుజాలు భుజాలు రాసుకుంటూ భాయీ భాయీ అంటు తిరిగిందీ, మళ్ళీ అదే నాయకులు ఒకరిమీద ఒకరు కారాలూ మిరియాలూ నూరుతూ బద్ధశత్రువులయిందీ; ఏ పార్టీలు ఏ పార్టీలనుంచి పుట్టాయో, ఏ పార్టీల వెనక ఏ వర్గాలవారున్నారో, వారి నాయకులెన్ని ముఖాలు మార్చారో, వారి పుట్టుపూర్వోత్తరాలూ, వాళ్ళనుగురించి ఉన్న పుకారులూ అన్నీ మామయ్యకు బాగా తెలుసు. అందువల్లే, అంత అపారజ్ఞానం ఉండబట్టే మామయ్య ఎంతటి నాయకుడైనా 'ఉట్టి వెధవ' క్రింద జమకట్టివేయగలుగుతున్నాడు. నాయకులందరూ మా మామయ్య సలహా పొందవలసిన అవసరం ఎంతైనా కనపడుతుంది. కాని అన్యాయమేమంటే ఎన్నడూ ఏ నాయకుడూ కూడా మామయ్య సలహా తీసుకున్న పాపాన పోలేదు సరికదా, ఆఖరికి ఉత్తోత్తి వినాయకుడైనా మామయ్య ఉచితంగా ఇచ్చే సలహాలు గ్రహించరు. మీటింగులోనైనా మాట్లాడనీయరు. ఇది అన్యాయమంటారా, కాదీ అన్యాయమంటారా, మరి మరి అన్యాయమంటారా, మీరే చెప్పండి. అందువల్ల అటువంటి మీటింగులలో తాను చెప్పవలసి ఉండిన గంభీరోపన్యాసాలన్నీ మా ముందూ, మా అత్తయ్య ముందూ ఇస్తూ ఉంటాడు మామయ్య.

ఆవేళ పేపరురావడం ఆలస్యమయింది. చీకటిపడిపోయింది. (మా అమలాపురానికి పేపరు సాయంత్రమే వస్తుంది లెండి.) మామయ్యకు మన నాయకులమీద కోపం పొంగుకు వచ్చింది. ఈ నాయకులంతా ఈ కోనసీమను నిర్లక్ష్యం చేస్తున్నారు. వారి నేం చేయాలో మామయ్యకే తోచలేదు. తానే అధికారంలో ఉంటేనా అమలాపురానికి రైలు వేయించి ఉండును. అప్పుడు ఈ ఇబ్బందులు ఉండకపోను. పేపరు రావడం ఇంతఆలస్యం కాకపోను! ఏమైనా, ఎన్ననుకున్నా పేపరు ఇంకా వచ్చేటట్లు లేదు కాబట్టి, అంతవరకూ కూర్చోవడం ఎందుకని ముందర భోజనాలు చేసివేశాం. ఇంతలో పేపరూ వచ్చింది. అందరికీ ఒక్కసారే పేపరు చూడాలనిపిస్తుంది. అందరికీ ఆతురతే. అప్పుడప్పుడు పేచీలుకూడా రావడం కద్దు. కాని మామయ్యదే అధారిటీ కాబట్టి, ముందు పేపరంతా తాను సమగ్రంగా చదివేవరకు ఇంకొకరి చేతిలోనికి పోనీయడు. అంతవరకు వేచిఉండటానికి మా కోపిక ఉండదు కాబట్టి మామయ్య వెనకాలనిలబడి, మామయ్య విసుక్కుంటున్నా, పేపరు విశేషాలు చదివివేయడం మా కలవాటు. మామయ్య కొన్నికొన్ని విశేషాలు పైకి చదువుతున్నాడు.–నందికొండ ప్రాజెక్టు నిర్మాణం త్వరలోనే ప్రారంభం – కృష్ణా [illegible] రెగ్యులేటర్ పని మందకొడిగా సాగుతున్నదా? – గోదావరి ప్రాజెక్టులను గురించి ఇన్వెస్టిగేషన్ —

"చూడండ్రా కొద్దికాలంలో మన ఆంధ్రదేశం ఎంతగా మారిపోతుందో," అంటూ మొదలు పెట్టాడు మామయ్య పేపరు ప్రక్కన పెట్టి.

అప్పటికి అత్తయ్య వంటింటికి తాళం పెట్టి వచ్చికూర్చుంది. "ఎలా మారిపోతుందండీ, చెప్పండీ" అంది.

"ఎలా మారిపోవడమేమిటి? మన ఆంధ్ర రాష్ట్రంతో పోలినరాష్ట్రం ఇండియాలో మరొకటి ఉండగలదా అని. మనకు కృష్ణా, గోదావరీ, పెన్నా తుంగభద్రావంటి నదులున్నాయే అవే మనపాలిటి కల్పవృక్షాలనుకో. ఇన్ని నదులు ఏ ఒక్క రాష్ట్రంలోనూ ఉండడం అరుదు. ఇక నాటిమీద ప్రాజెక్టులు – చిన్న చిన్న ప్రాజెక్టులమాట అటుంచు, రామపాదసాగరం నందికొండ, సిద్ధేశ్వరం, పులిచింతల, గండికోట, సోమశిల ప్రాజెక్టులు – కట్టేశామనుకో అప్పుడు ఎన్ని లక్షల ఎకరాలు అదనంగా సాగులోకి వస్తాయో విన్నావా? కొన్ని అంచనాల ప్రకారం ఎనభైలక్షల ఎకరాలు అదనంగా సాగులోకి వస్తాయి. మెట్టలన్నీ మాగాణులైపోతాయి. దానికితోడు జపానీస్ వరిసాగు పద్ధతి బాగా ప్రచారంలోకి వచ్చివేస్తుంది. ట్రాక్టర్లు వగైరాలు బాగా వాడుకంలోకి వస్తాయి. ఇక అప్పుడు ఎంత పంట పండుతుందో ఊహించు. వెనక మన చిన్నతనంలో చూశామే ధాన్యం బస్తా అయిదారు రూపాయలకు రావడం సరిగా అలాంటి ధరలే వస్తాయి. రైతులకే నష్టం ఉండదులే. బస్తా ధరతగ్గినా, మొత్తంమీద ఎక్కువ పండడంవల్ల ఇప్పటికన్న ఎక్కువ ఆదాయం వస్తుంది అప్పుడు. ఇవే కాదు తోటలూ ఎక్కువైపోతాయి. కటిక దరిద్రుడుకూడా అప్పూట కూరతో పండో ఫలమో వేసుకోకుండా తినడు"—

మా మామయ్య ఇలా వర్ణిస్తూంటే మా నోరూరసాగింది. ఆసక్తితో వినసాగాము.

"అప్పుడీ అక్కుళ్ళ మొగం చూసేదెవరు? మంచి సన్నాలే మనం తినడం. – అది అలా ఉంచు. ఇక కొన్నాళ్ళకు తుంగభద్రనుంచి ఎలెక్ట్రిసిటీ వస్తుంది. ఇటు మాచ్ ఖండ్ నుంచి వస్తుంది. ఆపైన రామపాదసాగరం, నందికొండ, పులిచింతల, మొదలైన ప్రాజెక్టులన్నీ పూర్తి అయ్యాక కొన్ని లక్షల కిలోవాట్ల విద్యుచ్ఛక్తి తయారవుతుంది. అప్పుడు చూడు – మన ఇల్లు ఎలా మారిపోతుందో ఆలోచించావా? అమెరికాలో జరుగుతున్నట్లు చెప్పుకుంటారే ఆవిధంగా ఉంటుంది. అన్నిటికీ ఎలెక్ట్రిసిటీయే. ఒక మీట నొక్కుతావు, నీళ్ళు కాగిపోతాయి; ఒక మీట నొక్కుతావు, అన్నం ఉడికిపోతుంది; ఒక మీట నొక్కుతావు కూర వేగిపోతుంది; ఒక మీట నొక్కుతావు, మెషీన్ గిన్నెలుతోమి, కడిగి ఇస్తుంది; ఇంకొకమీట నొక్కుతావు? బట్టలు ఉతికి ఆరబెట్టి ఇస్తుంది ఒక మెషీన్. ఇక నేను బ్లేడ్లకోసం తంటాలుపడవలసిన అవసరం ఉండదు. ఎలెక్ట్రిక్ షేవర్ తీసి ఒకసారి ఇటూ అటూ రాస్తాను, అంతే గడ్డం సాఫ్ అయిపోతుంది. ఒక కొసమిటి – ఇటు వాల్తేరునుంచి మద్రాసువరకూ, బెజవాడనుంచి హైదరాబాదువరకు రైళ్లు ఎలెక్ట్రిసిటీమీదే నడుస్తాయి ఎలెక్ట్రిక్ రైలంటే ఎంత హాయిగా ఉంటుందనుకున్నావు! ఎంత వేగంగా పోతుందనుకున్నావు! అప్పుడు ఈ దిక్కుమాలిన లంకణాల బోట్లలో తిరగవలసిన పని ఉండదు. ఇంత ఎలెక్ట్రిసిటీ తయారుకావడంవల్ల చిన్నచిన్న పల్లెటూళ్ళకు కూడా వస్తుంది. గ్రామాల్లోకూడా ఎలెక్ట్రిక్ లైట్లూ, ప్రతి ఇంటా రేడియోలూ ఉంటాయి. ఎక్కడపడితే అక్కడే ఫాక్టరీలు తయారవుతాయి. కొత్త ఫాక్టరీలు, సైకిలు ఫాక్టరీలు, ఆ ఫాక్టరీలూ ఈ ఫాక్టరీలూ ఇక


## కుష్ఠు ★ బొల్లి

వగైరా మేహముచ్చలు, సెగ, సవాయి వ్యాధులకు గ్యారంటీ చికిత్స. క్యాటలాగు ఉచితము:

సలహాకు **జి. వి. రెడ్డి & కో.** (రిజిష్టర్డు)

"భాస్కరాశ్రమము"

**గోపాలపురం. తూర్పుగోదావరి.**

# ★ మా మామయ్య ★

చెప్పాలా - మన కోనసీమలో కూడా నూనె ఫాక్టరీలూ, సబ్బు ఫాక్టరీలు వగైరాలు లేస్తాయి. మనపట్టణాలు ఇప్పుడున్నప్పటి కంటె నాలుగైదురెట్లు పెరిగిపోతాయి. కొత్తపట్టణాలు బయలుదేరుతాయి. ఎక్కడ చూసినా తారురోడ్లూ, సిమెంటురోడ్లే. ఎన్నో కొత్తకాలేజీలు వస్తాయి. ఎన్నో సినిమాహాళ్లు బయలుదేరుతాయి. స్టూడియోలు తయారవుతాయి. టెలివిజనూ, సినిమాస్కోపూ కూడా వస్తాయి. ఇంటింటికి టెలిఫోన్లు ఉంటాయి. ప్రతి పెద్ద పట్టణానికి ఒక 'ఏరోడ్రమ్' ఉంటుంది. ఈ కోనసీమకు కూడా అలమూరు వంతెన పడడంవల్ల రాకపోక లెక్కువైపోతాయి. అప్పుడు గోదావరి భయమే ఉండదు."

"అవును ఆ వంతెన ఎప్పుడు పడుతుందంటారు? దేవుడు ఈ దిక్కుమాలిన డెల్టాలో ఎందుకు వేశాడా అనిపిస్తోంది. ఎటుపోయినా గోదావరి తప్పదాయె. ఎప్పుడు నడిగోదావరిలో నావ బుడుంగుమంటుందో నన్న భయమే" అంది అత్తయ్య.

"ఇక ఆ భయం ఉండదులే. తిన్నగా కారుమీద కాకినాడో, రాజమండ్రీయో వెళ్ళతావు. అక్కడినుంచి ఎలెక్ట్రిక్ రైలెక్కి బెజవాడ మూడుగంటల్లో చేరుకుంటావు. మరీ అర్జంటైతే కాకినాడలో విమానమెక్కి గంటసేపటిలో బెజవాడ దగ్గర వాల్తావు—"

మామయ్య భవిష్యత్ స్వప్నాలు వింటూంటే అత్తయ్య గాలిలో తేలిపోయింది. "ఈ ఇరవైఏళ్లూ ఒక్కసారిగా గడచిపోతే బాగుండును. ఆ చెప్పినవన్నీ ఒక్కసారిగా నిజమైపోతే బాగుండును!" అంది ఉత్సాహం పొంగిపోతూ.

తన ఉపన్యాస ప్రభావం బాగా పడిందని గ్రహించి మామయ్య సంతృప్తి చెందాడు. "తొందరపడతావేం, వెర్రి దానా. అన్నీ చూస్తావు, ఎటొచ్చీ కాస్త టైంపడుతుంది అంతే."

"ఏమండీ మరి రామపాదసాగరానికి చాలా డబ్బు అవుతుందటని మీరే చెప్పారు. అంత డబ్బు ఎక్కడనుంచి వస్తుందండీ" అని ప్రశ్నించింది అత్తయ్య. (మా అత్తయ్య తక్కువది కాదండోయ్. పైకి ఏమీ తెలియనట్టున్నా మా మామయ్య ఉపన్యాసాల ప్రభావంవల్ల ఒక రాజనీతిజ్ఞురాలై కూర్చుంది!)

"ఎక్కడనుంచేమిటి? ప్రజలనుంచే వస్తుంది. ప్రాజెక్టు కట్టితే అనుభవించేది మనమేకదా. రూపాయిపెట్టితే రెండు రూపాయలు వస్తుందంటే రూపాయి పెట్టడానికి ఎవడు వెనకదీస్తాడు? ప్రభుత్వం కట్టడానికి సిద్ధమైందంటే ప్రజలు ఎంత డబ్బైనా భరించడానికి తయారే-అన్నట్టు చెప్పడం మరచిపోయాను. రేపు చీకటితోటే లేచి రాజమండ్రీ వెళ్ళాలి."

"ఎందుకు?"

"రామపాదసాగరం ప్రాజెక్టు సభకు రమ్మని ఆహ్వానం వచ్చింది."

"మీకే!"

"ఊఁ. మనమంటే ఏమనుకున్నావ్! రేపు వెళ్ళి రామపాదసాగరం ప్రాజెక్టు కోసం పెద్ద ఆందోళన లేవదీయాలి. ప్రభుత్వంచేత ఊఁ అనిపించివేయాలి."

"అయితే రామపాదసాగరం ప్రాజెక్టు కట్టడం అసాధ్యమేమో? వెనక ఎవరో అది కట్టడమూ ఇక్కడనుంచి రంగాని (రంగూను)కి వంతెన కట్టడం ఒకటే నన్నాడని మీరే చెప్పారుకదూ. అదీకాక నందికొండ ప్రాజెక్టు కట్టబోతున్నారన్నారు. అటువంటప్పుడు ఇదికూడా కట్టడానికి ఒప్పుకుంటారా?" అని ప్రశ్నించింది అత్తయ్య. (మా అత్తయ్య సామాన్యురాలు కాదని చూస్తున్నారుగదూ.)

"అక్కడే ఉంది తమాషా", అన్నాడు మామయ్య ముందుకు వంగి చిటిక వేస్తూ. అన్ని ప్రాజెక్టులకోసం ఒక్కసారే ఆందోళన లేవదీస్తే ఏ ఒక్కటీ కట్టడం జరగదు. అందువల్ల ముందు ఒకదానికి ఆందోళన లేవదీసి దానికి ఒప్పుకునేటట్లు చేయాలి. ఆపైన రెండోదానికి ప్రారంభించాలి. వచ్చినది రాబట్టి ఆపైన రానిదానికోసం పోరాడాలి. అదే ఉపాయం. నందికొండకు ఎలాగైనా ఒప్పుకుంది ప్రభుత్వం. ఇక ఇప్పుడు రామపాదసాగరానికి ఆందోళన లేవదీయాలి. రేపు సభలో చూడు ఏం చేస్తామో. ఎంత ఆందోళన లేవదీస్తామో!- ఒరే, అబ్బాయి, తెల్లవారగట్ల మూడుగంటలకు అలారం పెట్టరా. మొదటి బస్సుకు వెళ్ళాలి."

నేను అలారం పెట్టాను.

"ప్రయాణం ఖాయమే నన్నమాట?" అని అడిగింది అత్తయ్య.

"ఆ, ఖాయం కాకపోతే! ఆహ్వానం వచ్చిన తర్వాత వెళ్ళకపోతే ఏం బాగుంటుంది? వెళ్లి చాలా హంగామా చేయాలి."

"అయితే త్వరగా పడుకోండి. లేకపోతే తెల్లవారగట్ల లేవడం కష్టమవుతుంది" అంది అత్తయ్య.

అంతా పడుకున్నాం. గాలి లేదు ఉక్కపోత ఎక్కువగా ఉంది. చాలా సేపటివరకూ నిద్రే పట్టలేదు. ఏ ఒంటిగంటకో నిద్రపట్టింది. మరి కాసేపటికి అలారం గణగణ మోగడం మొదలుపెట్టింది. మామయ్య లేస్తాడేమో చూశాను. లేవలేదు. అలారం మ్రోగుతూనే ఉంది. ఆఖరికి నేనే లేచి అలారం ఆపుచేశాను. వెళ్ళి మామయ్యను తట్టాను. కదలలేదు. కుదిపాను. కదలలేదు. దొర్లించాను. "ఊఁ— ఊఁ" అంటూ ఒకసారి ఇటు దొర్లాడు. 'ఏమిటీ' అంటూ ఒకసారి అటు దొర్లాడు.

"రాజమండ్రీ వెళ్ళవూ?" అని అడిగాను.

"లేదు" అన్నాడు మామయ్య.

"అదేమిటి సభకు వెళ్తానన్నావే. అలారం పెట్టమన్నావు."

"రాత్రంతా నిద్రే లేదు. ఇప్పుడే కాస్త కునుకుపడుతోంది. ఇప్పుడు నిద్ర పాడు చేసుకొని ఎవడు పోతాడు?"

"మరి ఆహ్వానం వచ్చిందన్నావు! సభకు వెళ్ళవలసిందే నన్నావు!"

"ఆహ్వానాల కేంలే. డబ్బు వదిలించడానికి. ఇంతకీ మనం వెళ్లకపోయినంతలో సభ ఆగిపోదు. అసలు ఈ సభ జరగకపోయినా వచ్చిన నష్టమేమీ లేదు. ప్రాజెక్టువల్ల ప్రయోజనముంటే ప్రభుత్వమే చేస్తుంది. ప్రయోజనం లేకపోతే మనం ఎంత నోరు చించుకున్నా కదలదు. అంతా ప్రభుత్వానికే వదలడం మంచిది. పైగా ఈ సభకి పోయిరావడానికి ఖర్చు ఎవడు ఇస్తాడు? అంతా చేతి చమురే. ఆ సభకు వెళ్ళినా మన మాట వినేవాడుండడు. ఏ పార్టీ అ నాయకులో పెత్తనం చెలాయిస్తారు. ప్రభుత్వం దగ్గరకు పోయే ప్రతినిధి వర్గాలలో కూడా వాళ్లే ఉంటారు. చందాలు చెల్లించడానికి మనం కావలసివస్తుంది. వెధవ చందాలతో చచ్చిపోతున్నాం. ఎన్నని భరించడం? అంతా ప్రభుత్వానికే విడిచిపెట్టి హాయిగా నిద్రపోదాం," అంటూ మామయ్య పక్కకు తిరిగి గుర్రు పెట్టడం మొదలుపెట్టాడు.

* * *

ఇప్పటికీ మామయ్య - తానొక పైసా ఖర్చు పెట్టడానికిగాని, పిసమెత్తు కృషి చేయడానికిగాని సిద్ధపడకపోయినా- అన్ని ప్రాజెక్టులూ తయారైపోతాయి, పల్లెలు పట్టణాలయిపోతాయి, మన తెలుగుదేశం స్వర్గతుల్యమయిపోతుందని గట్టిగా విశ్వసిస్తూనే ఉంటాడు. ★